నేలవాలిన వరి..


మోపిదేవి కాలనీ వద్ద నేలవాలిన వరిపంట


మోపిదేవి వద్ద మినుము విత్తనాలు చల్లిన పొలంలో వర్షం నీరు

- పట్టించుకోని అధికారులు
- ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవంట
- పడిపోయి దెబ్బతిన్న పొలాలు పరిశీలించరా!
- కూటమి ప్రభుత్వంపై రైతుల కన్నెర్ర
- అధికారులపై టీడీపీ నేతల ఆగ్రహం
- మినుము విత్తనాలు కుళ్లిపోతున్నాయి

అవనిగడ్డ: 'ఫెంగల్' తుపాను ప్రభావానికి వరి నేల వాలినా.. అధికారులు పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదు. తుపానులు, భారీ వర్షాలకు పంట దెబ్బతింటే గతంలో నష్టం అంచనాలు వేసేవారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరి నేలవాలినా నష్టం అంచనాలు వేసేందుకు ఎవరూ రాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని పరిహారం ఇచ్చే సంగతి ఎలా ఉన్నా ముందు దెబ్బతిన్న పంటలను పరిశీలించేవారని, ఇప్పుడు పొలాల వైపు కన్నెత్తి చూడటం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఎనిమిది వేల ఎకరాలకు పైగా పంట నష్టం

నియోజకవర్గంలో ఖరీఫ్‌లో 98,645 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇటీవల ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆరు మండలాల్లో ఎనిమిది వేల ఎకరాలకు పైగా వరిపంట నేలకొరిగినట్టు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. వీటిలో కొన్నిచోట్ల పాలుపోసుకునే దశలో ఉన్న పంట పడిపోగా, మరి కొన్ని చోట్ల కోతకొచ్చిన దశలో పడిపోయాయి. పాలుపోసుకునే దశలో పంట పడిపోతే సగానికి సగం దిగుబడి తగ్గిపోతుందని రైతులు చెప్పారు. కోతకు వచ్చి పడిపోయిన పంట నీటిలో నానడంతో మొలకలు వస్తున్నాయని కొంతమంది బాధిత రైతులు తెలిపారు. దెబ్బతిన్న పంటలను చూడాలని అధికారులను అడుగుతుంటే నష్ట పరిశీలనకు సంబంధించి ప్రభుత్వం నుంచి గానీ, ఉన్నతాధికారుల నుంచి గానీ ఇంతవరకూ ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పినట్టు కొంతమంది రైతులు వెల్లడించారు.

కూటమి నేతల అసంతృప్తి

ఆరుగాలం పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్ల ద్వారా కొనుగోలు చేయక పోవడంపై పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. తేమ శాతంతో సంబంధం లేకుండా యంత్రాలతో కోసి అప్పుడప్పుడూ తీసుకొచ్చిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీలు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేసిన విషయం ఘంటసాల మండలంకు చెందిన కొంతమంది టీడీపీ నేతలు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన ఎంటీయూ 1262, 1318 రకాలను ఇప్పుడు మిల్లర్లు ఎందుకు కొనరని నిలదీస్తున్నారు.

రైతుల్లో ఆందోళన

వారం క్రితం పలు ప్రాంతాల్లో రెండోపంటగా చల్లిన మినుము విత్తనాలు వర్షాలకు నీరు నిలిచి కుళ్లిపోతున్నాయి. కొన్నిచోట్ల మొలక వచ్చిన విత్తనాలు తిరగబడి కుళ్లిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫెంగల్ తుపాను నియోజకవర్గంలోని రైతులను అన్ని విధాలా నష్టపరిచింది. ప్రభుత్వం నుంచి సాయం అందుతుందేమోనని ఆశగా ఎదురు చూసిన రైతులకు నష్టం అంచనాలు వేయక పోవడంతో నిరాశ చెందుతున్నారు.

ఐదెకరాల్లో పంట పడిపోయింది



మొత్తం 11 ఎకరాలు వరిసాగు చేశాను. తుపాను ప్రభావంతో ఐదెకరాల్లో పంట పడిపోయింది. నిలబడి ఉంటే యంత్రం ద్వారా కోయిస్తే ఎకరానికి నాలుగైదు వేలతో ధాన్యం ఇంటికొచ్చేది. పడిపోవడంతో యంత్రాలతో కోయించే అవకాశం లేదు. కూలీలతో కోయించి, కట్టేత, కుప్ప వేయించి నూర్పించడానికి ఎకరాకు అదనంగా రూ.15 వేలు ఖర్చు అవుతుంది. 1318 రకం బాగుంటేనే కొనడం లేదు. పడిపోయిన పంటను ఏమిచేయాలో దిక్కుతోచడం లేదు.

– డొక్కు శ్రీనివాసరావు, పెదప్రోలు, మోపిదేవి మండలం

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



కోడూరు: ప్రధాన సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ చాణిక్య తెలిపారు. మండల కేంద్రంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరగడంతో సర్పంచి వెన్నా షైనీ, కార్యదర్శి బండే శేషగిరిరావు విషయాన్ని ఎస్‌ఐ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎస్‌ఐ మంగళవారం రాత్రి స్థానిక వ్యాపారులుతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. దుకాణాల ఎదుట వాహనాలను నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, దీంతో భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. పార్సిల్ లారీలతో పాటు ఇతర వాహనాలను రహదారికి అడ్డుగా పెట్టడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్‌ఐ తెలిపారు. లారీలు, వ్యాన్లు, ఆటోలు కూడా రద్దీ లేని సమయంలో మాత్రమే దుకాణాల ముందు నిలిపి అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పంచాయతీ అధికారులను కోరారు. పంచాయతీ అధికారులు స్థలాలు కేటాయించేందుకు అంగీకరించడంతో నరసింహపురం, పంచాయతీ రోడ్డులో ఉన్న స్థలాలను వ్యాపారులతో కలిసి ఎస్‌ఐ పరిశీలించారు. శుక్రవారం వారపు సంత రోజు కూడా వాహనచోదకులు నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

పోరాట యోధుడు గొట్టిపాటి

ఘంటసాల: స్వాతంత్య్ర పోరాటంలో అనేక సార్లు జైలుకు వెళ్లిన పోరాట యోధుడు గొట్టిపాటి బ్రహ్మయ్య అని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల కేడీసీసీ బ్యాంకు ఆవరణలో రైతు పెద్ద, శాసనమండలి మాజీ చైర్మన్, స్వాతంత్య్ర సమరయోధుడు గొట్టిపాటి బ్రహ్మయ్య జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ బ్రహ్మయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

రైతులకు మరింత చేరువగా 'కృషి'



ఘంటసాల: కృషి విజ్ఞాన కేంద్రం సేవలు రైతులకు మరింత చేరువ కావాలని గుంటూరు లాం వ్యవసాయ పరిశోధన సహాయ సంచాలకుడు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రాన్ని దుర్గాప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకేలో శాస్త్రవేత్తల పనితీరు, రైతులకు అందిస్తున్న సేవలు, వారి వారి విభాగాల్లో ప్రదర్శనలు, భవిష్యత్తు ప్రణాళికలపై డాక్టర్ దుర్గా ప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేవీకే ప్రాంగణంలోని వరి విత్తన ఉత్పత్తి కేంద్రం, కోళ్లు, పశువులు, మేకల పెంపకం, వానపాముల ఎరువు తయారీ కేంద్రం, అజోల్లా, ఉద్యాన నారు పెంపకం, తదితర ప్రదర్శనలను పరిశీలించి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో 'కూటమి' విఫలం

రైతు సంఘం నేత వాకా రామచంద్రరావు



ఘంటసాల: ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం నేత వాకా రామచంద్రావు అన్నారు. ఘంటసాలలో రామచంద్రరావు మంగళవారం మాట్లాడుతూ అమ్మకపోతే అడవి కొనకపోతే కొరివిగా ఉంది రైతులపై కూటమి ప్రభుత్వ విధానమన్నారు. సన్నబియ్యం మార్కెట్లో 25 కేజీల బ్యాగ్ రూ.1800కు అమ్ముతూ కొనే వారికి చుక్కలు చూపిస్తున్నారన్నారు. రైతులు పండించిన సన్న బియ్యం ధాన్యాన్ని కొనే నాథుడు లేకపోవడం, అడ్డగోలుగా దోచేయడం దురదృష్టమన్నారు. తెలంగాణలో సన్న బియ్యం ధాన్యం పండించిన రైతుకు క్వింటాకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుంటే, ఏపీలో బోనస్ సంగతి దేవుడెరుగు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకైనా 1262 ధాన్యం కొనడం లేదన్నారు.

అభయాంజనేయుడికి పుష్పాభిషేకం

భావదేవరపల్లి(నాగాయలంక): కార్తిక పూజలు ముగిసిన సందర్భంగా స్థానిక శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలోని శ్రీఅభయాంజనేయస్వామికి మార్గశిర మంగళవారం విశేష పుష్పాభిషేకం నిర్వహించారు. అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో 20 కేజీల వివిధ వర్ణాల చామంతి పూలు, ఎర్ర గులాబీలు, తమలపాకులతో స్వామివారికి వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు–శివసత్యవతి దంపతులు అభిషేక నివేదన జరిపారు.

కరపత్రాల పంపిణీ



మోపిదేవి: విజయవాడలో జనవరీ 5వ తేదీన నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు భారీగా తరలిరావాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వర్రె రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మోపిదేవి ప్రధాన సెంటర్లో కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు చిరువోలు బుచ్చిరాజు, మోపిదేవి ప్రఖండ్ అరజా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిపై కేసు

బంటుమిల్లి: పెళ్లి చేసుకుంటానంటూ ఏడాది కాలంగా శారీరక సంబంధం ఏర్పరచుకుని బాలిక గర్భం దాల్చిన తర్వాత ముఖం చాటేసిన ఘటన మండల పరిధిలోని సాతులూరు పంచాయతీ శివారు దళితవాడలో చోటు చేసుకుంది. దీనిపై మంగళవారం బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ గ్రామంలో దర్యాప్తు చేశారు. పోలీసుల సమాచారం మేరకు గ్రామానికి చెందిన దర్శి వెంకటస్వామి అనే యువకుడు అదే గ్రామానికి చెందిన సుమారు 17 ఏళ్ల బాలికను పెళ్లి చేసుకుంటానంటూ నమ్మించాడు. చివరకు బాలిక గర్భం దాల్చిన తర్వాత పెళ్లి చేసుకోకుండా ముఖం చాటేశాడు. ఈ క్రమంలో బాలిక ఇటీవల ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఈ నెల 2వ తేదీన తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గణేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

పెడన: వైకల్యం శరీరానికేగాని మనసుకు కాదని, దివ్యాంగులను ధైర్యవంతులను చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పెడన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.సాయిప్రీతి అన్నారు. మంగళవారం లెప్రాసొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగులతో స్నేహభావంతో మెలగుతూ మానసికంగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో లెప్రా సొసైటీ ఓఆర్‌డబ్ల్యూ ఎం.నాగమణి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెడన: విభిన్న ప్రతిభావంతులకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా అనేక సౌకర్యాలను కల్పిస్తోందని సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా ఏపీవో క్లోపల్లి ఏడుకొండలు అన్నారు. పెడన బంగ్లా స్కూల్లో ప్రత్యేక అవసరాల విద్యార్థుల విద్యా వనరుల కేంద్రం(భవిత సెంటర్)లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈవో–2 వైవీవీ హరనాథ్, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, పేరెంట్ కమిటీ వైస్ చైర్మన్ బాబు, భవిత కేంద్రం టీచర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

- యూడైస్‌లో విభిన్న ప్రతిభావంతుల విద్యార్థుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేయాలని ఏడుకొండలు తెలిపారు. నమోదు చేస్తే వారికి ప్రభుత్వం కల్పించే అలవెన్సులు, ఉపకరణాలను పొందుతారన్నారు.

శ్రీకాకుళం(ఘంటసాల): దివ్యాంగులతో చదివిస్తే వారి భవితకు బంగారు బాటలు వేసినట్లవుతుందని శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), ఎంఈవో 2 ఎండీ మోమిన్, ఐఈఆర్పీ జి.శ్రీకాంత్, వార్డు సభ్యుడు శ్రీనివాసరావు, శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అన్నపురెడ్డి అనుపల్లవి భువనేశ్వరి, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం టి.నాగబాబు తదితరుల పాల్గొన్నారు.


బంటుమిల్లిలో దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి భాస్కరరావు


నాగాయలంకలో స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న తహసీల్దార్ హరనాథ్, ఎంఈఓ పెరుమాళ్లు

కోడూరు: దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. 85 మంది దివ్యాంగ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.400 చొప్పున స్కాలర్‌షిప్‌ను అందించారు. ఎంఈఓ–2 శ్రీనివాసరావు, ఐఈఆర్‌టీ బి.రంగాదేవి, టీచర్స్ సొసైటీ కార్యదర్శి మన్నె ప్రేమ్‌చంద్, డైరెక్టర్లు ఎస్.సూరయ్య, యు.ప్రసాద్ పాల్గొన్నారు.

నాగాయలంక: మండల విద్యాకుటుంబం, మండల పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కె.పాలెం ప్రత్యేక అవసరత బాలల పాఠశాల (భవిత కేంద్రం) ఆవరణలో మంగళవారం ఎంఈఓ అన్నపరెడ్డి రామారావు అధ్యక్షతన జరిగిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో తహసీల్దార్ హరనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాలలోని 38 మంది దివ్యాంగ బాలలకు మండల పరిషత్ టీచర్స్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సహకారంతో ఒక్కొక్కరికి రూ.350చొప్పున స్కాలర్‌షిప్‌లు, బహుమతులు అందచేసారు. డెప్యూటీ తహసీల్దార్ మహ్మద్ రఫీ, సొసైటీ అధ్యక్షుడు జీవీఎస్ పెరుమాళ్లు, ఎంపీటీ(ట్రైనర్)డాక్టర్ ఎస్.శివపార్వతి, వీఆర్వో పి.కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: స్థానిక నీలిపూడి భవితకేంద్రంలో జరిగిన దినోత్సవంలో ఎంఈవో ఎస్‌కేవీడీ ప్రసాదరావు విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం బాబు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, ఐఈఆర్‌పీ టీచర్ వరుణ్‌బాబు, సీఆర్‌పీ తంబిబాబు పాల్గొన్నారు.

బంటుమిల్లి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలి న్యాయ విజ్ఞాన సమితి ఆధ్వర్యాన స్థానిక భవిత భవనంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎంఈవో వి త్రిపురసుందరిదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 వెంకటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గూడూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ సీఎంఓ టి.రమేష్ అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని గూడూరు భవిత కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గూడూరు ఎంఈఓ–2 పి.సుబ్రహ్మణ్యం, జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం డి.పుష్పలత, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం కె.వాణి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించాలంటూ ఆందోళన

కోడూరు: కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయ ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించాలంటూ అయ్యప్ప దీక్షాపరులు మంగళవారం నిరసన తెలిపారు. స్థానిక ఒకటో వార్డులో 1998లో అయ్యప్పస్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మించిన స్థలానికి పంచాయతీ రహదారి మధ్య కొంత ఖాళీ స్థలం ఉంది. ఆలయ కమిటీ సభ్యుల విన్నపం మేరకు ఆ స్థలాన్ని ఆలయ అవసరాల కోసం వినియోగించుకొనేందుకు వీలుగా పంచాయతీ తీర్మానం చేసింది. నాటి నుంచి ఆ స్థలాన్ని ఆలయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. ఇటీవల ఆ స్థలాన్ని మెరక చేసి ప్లాట్‌ఫాం కూడా నిర్మించారు. తాజాగా దాన్ని తొలగించాలంటూ కోడూరు పంచాయతీ అధికారులు నోటీసులివ్వడం వివాదానికి తావిచ్చింది. వాటిని అధికారులు వెంటనే వెనక్కి తీసుకొని ఖాళీ స్థలాన్ని ఆలయానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ దీక్షాపరులు మంగళవారం నిరసన తెలిపారు. ఆలయం నుంచి కోడూరు పురవీధుల మీదుగా ర్యాలీ జరిగింది. పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. తహసీల్దార్ శ్రీనునాయక్, పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావులకు వినతిపత్రం అందించారు.


తహసీల్దార్ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు, దీక్షాధారులు

పేదలకు ఉపాధి పథకంతో ఆర్థిక చేయూత

కృత్తివెన్ను: పేదలకు ఉపాధి పథకంతో ఆర్థిక చేయూత అందుతోందని డ్వామా పీడీ ఎస్.వి.శివ ప్రసాద్ యాదవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. 'ఉపాధి'తో ప్రస్తుతం మినీగోకులం పేరుతో పశుశాలల నిర్మాణం జరుగుతోందని, వాటి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై వారం రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల నివేదికలను ప్రజావేదికలో వెల్లడించారు. 2023– 24లో మండలంలో 1,473 పనులకు రూ.9.76 కోట్లు వెచ్చించినట్లు ఎస్‌ఆర్‌పీ సత్యనారాయణ తెలిపారు. వీటిపై సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. మొత్తం 16 పంచాయతీల్లో రూ.2.17 లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రామ్మోహన్, విజిలెన్స్ అధికారి సురేష్, జెక్యూసీ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఓ సైదారావు, ఈసీ నాగసురేష్, డీఆర్‌పీ, ఎఫ్ఏలు, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.


డ్వామా పీడీ శివప్రసాద్ సమక్షంలో నివేదికలు వినిపిస్తున్న డీఆర్‌పీ జగదీష్

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన

మోపిదేవి: గుండెపోటుకు గురైనవారికి 10 నిమిషాల లోపు కంప్రెషన్ ఇవ్వడం ద్వారా బతికించవచ్చని ఆరోగ్య భారతి స్వచ్ఛంద సంస్థ డాక్టర్ వంగర శేషగిరిరావు తెలిపారు. మోపిదేవి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. గుండెజబ్బుకు గురైన వ్యక్తిని అంబులెన్స్ వచ్చే లోపు నిమిషానికి 120 సార్లు కంప్రెషన్ ఇస్తూ బాడీని గమనిస్తూ ప్రతి 30 కంప్రెషన్లకు ఒకసారి బ్రీతింగ్ ఇవ్వడం ద్వారా బతికించవచ్చని తెలిపారు. ఆరోగ్య భారతి జిల్లా కార్యదర్శి డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిబాధిత కుటుంబానికి సాయం

కోనేరుసెంటర్: అగ్నిబాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. బందరు మండలం కానూరు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వంకోల్పోయిన ఈవన సత్యనారాయణ కుటుంబానికి మంగళవారం 25 కేజీల బియ్యంతో పాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో చితికినేటి అయ్యప్ప, గోపు వెకంటరమణ, బొలిశెట్టి నాని, ఈవన ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ గుడిలో చోరీ

గూడూరు: ఆకులమన్నాడులోని గంగానమ్మ గుడిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుడిలోకి చొరబడిన దుండగులు ఆలయంలో ఉన్న హుండీలు పగలగొట్టి అందులో ఉన్న కానుకలు, నగదు అపహరించారు. అమ్మవారి బంగారపు రెండు సూత్రాలు, వెండి మెట్లు కూడా దొంగిలించినట్లు స్థానికులు గుర్తించారు. మంగళవారం ఉదయం గుడిలో దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకున్న ఆలయ కమిటీ ప్రతినిధి పెద్దిశెట్టి నాగరాజు గూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై కె.ఎస్.ఎన్.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందీ పరీక్షల్లో బల్లిపర్రు గురుకుల విద్యార్థినుల ప్రతిభ



పెడన: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయని, వీటిల్లో బల్లిపర్రు గురుకుల పాఠశాల విద్యార్థినిలు విశేష ప్రతిభ చూపించారని ప్రిన్సిపాల్ ఎస్.రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 మంది హాజరవ్వగా అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ప్రాథమికకు 15 మంది విద్యార్థినులు, మధ్యమకు 62, రాష్ట్రకు 26, ప్రవేశికకు ఐదుగురు విద్యార్థినులు హాజరవ్వగా అందరూ కూడా ప్రథమశ్రేణి మార్కులు సాధించారని తెలిపారు. హిందీ ఉపాధ్యాయురాలు ఎండీ హసీనా బేగం, ఎండీ ఆషానిలను, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

మద్దతు ధర కంటే తక్కువకు కొంటే చర్యలు

ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

సాక్షి స్పందన

అవనిగడ్డ: మద్దతు ధరకంటే తక్కువగా ధాన్యం కొనుగోలు చేసినా, ఎంటీయూ 1262, 1318 ధాన్యం రకాలను కొనుగోలు చేయక పోయినా అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. నియోజకవర్గంలో రైతులు పండించిన వివిధ రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవడంతో రోడ్ల పక్కన నిల్వ చేసిన రాశుల్లోకి వర్షం నీరు చేరడంతో కొన్నిచోట్ల ధాన్యం మొలకలు వచ్చాయి. 1262, 1318 రకాల ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు. ఈ పరిస్థితులపై 'మొలకలొస్తున్నాయి' శీర్షికతో 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మిల్లర్లు, రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని రకాల ధాన్యాన్ని మిల్లర్లు కచ్చితంగా కొనుగోలు చేయాల్సిందేనన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు.

డ్రయర్స్ అందుబాటులోకి తీసుకురావాలి

వరికోత యంత్రాల వినియోగం ఎక్కువగా జరగడం, వరికోతలు ఒకేసారి రావడంతో ధాన్యం కొనుగోళ్లకు డిమాండ్ పెరిగిందని చల్లపల్లిలో పలువురు రైతులు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు తెలిపారు. ధాన్యం ఆరబెట్టుకోవడానికి డ్రయర్స్‌ని అందుబాటులో తీసుకురావాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తానని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలోతహసీల్దార్లు శ్రీలత, బి విజయప్రసాద్, ఎంపీడీవో అనగాని వెంకటరమణ, ఎంపీపీ కోట విజయరాధిక, పలువురు నేతలు పాల్గొన్నారు.


చల్లపల్లిలో అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

రైతులూ ఆందోళన వద్దు

మోపిదేవి: మండలంలో పలు గ్రామాల్లో పర్యటించిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, రైతులు, మిల్లర్లతో మంగళవారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సమీక్షించారు. రైతు సేవా కేంద్రాల్లో నిర్ధారణ చేసిన తేమ శాతమే ఫైనల్ అని, మిల్లులో తేమ శాతం తేడా వస్తే తహసీల్దార్‌కు సమాచారం అందించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా తనకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ మేడపాటి శ్రీవిద్య, ఏఓ హెప్సీబా రాణీ, వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్టర్ పుస్తకాలు పక్కాగా ఉన్నాయా..?

పెడన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో గీతాబాయి

పెడన: అటెండెన్సు, మూమెంట్ రిజిస్టర్ పుస్తకాలు అన్ని సక్రమంగా ఉన్నాయా, వాటిని నిర్వహిస్తున్నారా లేదా అంటూ వాటిని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి పరిశీలించారు. ఆమె మంగళవారం పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. తొలుత ఆమె ఆస్పత్రిలో ఆశా డే కార్యక్రమం జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించి ఎంత మంది ఆశా వర్కర్లు హాజరవుతున్నది, వారి అటెండెన్స్ వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి సూచనలు జారీ చేశారు. కాన్పులు తక్కువగా ఉంటున్నాయని, ఆ సంఖ్య పెంచాలని సూచించారు. అనంతరం ఆమె మండలంలోని కాకర్లమూడిలో జరుగుతున్న ఎన్‌సీడీసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమెతో పాటు పెడన పీహెచ్‌సీ వైద్యురాలు మీనాక్షిదేవి, ఎంపీఈవో సుధాకర్, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులున్నారు.


పెడన పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి

23 రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాయి

అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్

అవనిగడ్డ: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, దేశంలో 23 రాష్ట్రాలు వర్గీకరణను వ్యతిరేకిస్తుండగా, ఉభయ తెలుగు రాష్ట్రాలు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం అమలు చేయడానికి సిద్ధమవుతున్నాయని అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. స్థానిక ఏ వన్ సమావేశ హాల్లో మంగళవారం మాలల సమావేశం నిర్వహించారు. దేవిప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీల్లో 59 ఉపకులాలవారు నష్టపోతారని చెప్పారు. క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని చెప్పడంతో మాదిగలు కూడా నష్టపోతారన్నారు. దేశంలో 22 శాతం ఎస్సీ జనాభా ఉంటే 15 శాతం మాత్రమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలంటే ముందుగా దేశవ్యాప్తంగా కులగణన చేయాలని దేవి ప్రసాద్ చెప్పారు. ఈనెల 15న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా గుంటూరు నల్లపాడు వద్ద జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏబీఎస్ పార్టీ వ్యవస్థాపకులు పంతగాని రమేష్, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, జైభీమ్ భారత్‌పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సముద్రాల అంబేడ్కర్, న్యాయవాది కర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.